నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మణికొండ: పుప్పాలగూడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్డు నెంబర్ 1నుంచి 13 వరకు మంగళవారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటలకు వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు శివాజీనగర్, సుందర్‌గార్డన్, మణికొండ గార్డన్, మణికొండ క్వార్టర్స్, ఎంప్లాయిస్ కాలనీ, నాగేశ్వర్ వెంచర్‌లో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నామని ఏఈ జ్ఞానేశ్వర్ తెలిపారు.

రాజేంద్రనగర్: విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు తెలిపారు. భవానీ నగర్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, ఆదర్శ్ కాలనీ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. గాంధీనగర్, రాజేంద్రనగర్, నార్మ్ ఫీడర్ల పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

బండ్లగూడ: కిస్మత్‌పూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి పలు ఫీడర్లలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు ఏఈ సి.హెచ్.శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 3 గంటల వరకు కిస్మత్‌పూర్ గ్రామం, రాఘవేంద్ర కాలనీ, శివసాయికాలనీ, బాబమ్మ కాలనీ, మైత్రి కాలనీ, వినాయక్‌నగర్ కాలనీ, మారుతీ కాలనీ, శ్రీకృష్ణ బస్తీ, ఎస్సీ కాలనీ విల్లా గ్రీన్, అధ్యా విల్లాస్, వన్ విల్లాస్, గృహశిల్పి, గిరిధారి అపార్ట్‌మెంట్స్, హనుమాన్ దేవాలయం, కేటీటీ కాలనీ, శ్రీబాలాజీ ఎన్‌క్లేవ్, రాజా సేకేత్రా, గిరిధారి హోమ్స్, గిరిధారి విస్టా, ఎల్‌వీ ప్రసాద్, కీర్తి విల్లాస్, నమహా, మేపర్ కన్‌స్ట్రక్షన్స్, తదితర ప్రాంతాలలో ఈ కోత ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

వైస్ చైర్మన్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు


జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న నరేందర్, సంజయ్‌యాదవ్

శంషాబాద్: శంషాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్ భూ కబ్జా చేశాడంటు పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పి. సంజయ్‌యాదవ్‌లు సోమవారం జిల్లా కలెక్టర్ శశాంకకు ఫిర్యాదు చేశారు. మహిళకు సంబంధించిన భూమిని కబ్జా చేయడంతో పాటు తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడన్నారు. భూ కబ్జాపై సమగ్ర రెవిన్యూ సర్వే చేయించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్ నేతల వినతి మేరకు వెంటనే సంబంధిత శాఖ అధికారులకు కలెక్టర్ ఆదేశించినట్లు తెలిపారు.

మంచినీటి సమస్య పరిష్కారానికి కృషి


మంచినీటి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరుతున్న కాలనీ వాసులు

బండ్లగూడ: మంచినీటి సమస్యలను పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 7వ డివిజన్ పద్మశ్రీ హిల్స్ కాలనీ వాసులు ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. అనంతరం కాలనీలో మంచినీటి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ పద్మశ్రీహిల్స్ కాలనీలో మంచినీటి లైన్ సమస్యను త్వరలో పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామన్నారు. అధికారులతో కాలనీలో పర్యటించి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు మంచినీటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు కిషోర్‌రెడ్డి, పాపయ్యయాదవ్, కమిటి సభ్యులు ఉమామహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిందే


ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి

శంషాబాద్: రోడ్డు ప్రమాదాలపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని శంషాబాద్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. సోమవారం సాయంత్రం సాతంరాయిలోని అపర్ణ కన్‌స్ట్రక్షన్ వద్ద ఏర్పాటు చేసిన ట్రాఫిక్ చైతన్య కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరు హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలన్నారు. వాహనం నడిపించే వ్యక్తితో ప్రయాణిస్తున్న సహచరులు కూడా హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాల నుంచి బయటపడే అవకాశముంటుందన్నారు. కారు డ్రైవింగ్‌లో కూడా డ్రైవర్‌తో పాటు ప్రయాణికులందరు సీటు బెల్టును ధరించాలని ఆయన సూచించారు. ట్రాఫిక్ పోలీసులు సూచించిన నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు శాతం గణనీయంగా తగ్గుముఖం పడుతుందన్నారు.

నూతన వైద్య విధానాలతో సులువుగా చికిత్స

హెచ్‌సీయూ వీసీ ప్రొ.బీజేరావు


మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ బీజేరావు

రాయదుర్గం: వైద్యరంగం ప్రపంచవ్యాప్తంగా ఎంతో ప్రాధాన్యతను సంతరించుకొందని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజే రావు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో న్యూరో ఎండోస్కోపీ మాస్టర్: బేసిక్స్ క్లినికల్ ప్రాక్టీస్ అనే అంశంపై హెచ్‌సీయూ స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ విభాగం, కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్య రంగంలో నూతన వైద్య విధానాలతో చికిత్సలు మరింత సులువు అయ్యాయన్నారు. ఈ కోర్సును కృష్ణా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, హెచ్‌సీయూ సంయుక్తంగా బ్రెయిన్ అండ్ స్పైన్ సొసైటీ, ఎడ్యుకేషనల్ పార్టనర్‌గా ఏఈఎస్‌సీయూఎల్‌ఏపీ అకాడమీ, సన్‌ఫార్మా సహకారంతో నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కిమ్స్ గ్రూప్ ఆస్పత్రుల వ్యవస్థాపకుడు మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ భాస్కర్‌రావు బొల్లినేని, న్యూరో సర్జరీ విభాగం హెడ్ డాక్టర్ మానస్ పాణిగ్రహి, ప్రొఫెసర్ పి ప్రకాశ్‌బాబు, డాక్టర్ కేవీఆర్‌శాస్త్రి, ప్రొఫెసర్ ఆనంద్ కొండపి, జపాన్ ప్రతినిధులు డాక్టర్ నోబుహిటోమోరాటో, డాక్టర్ కె టేకుచి, పలువురు డాక్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.


అలకాపూర్ టౌనిషిప్‌లో జరిగిన సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్


పుప్పాలగూడ అంజలి గార్డన్‌లో కల్యాణోత్సవంలో పాల్గొన్న మణికొండ మున్సిపల్ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్

అంతా రామమయం

బండ్లగూడ: అయోధ్యలో బాలరాముని ప్రాణప్రతిష్ట సందర్భంగా బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పలు ఆయాల్లో ఆధ్యాత్మికతో నిండిన పలు రకాల కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్నో ఏళ్ల నిరీక్షణకు తెరపడిన శుభవేళ అయోధ్యలో దివ్యమైన రామమందిరంలో వేదపండితుల ఆధ్వర్యంలో విగ్రహ ప్రాణ ప్రతిష్ట సందర్భంగా బండ్లగూడ జాగీరు మున్సిపల్ పరిధిలో అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమాలు గంధంగూడలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో, తుల్జా భవానీ ఆలయం, ప్రశాంత్‌నగర్‌లోని రామాలయం, హైదర్షాకోట్ విజయ గణపతి దేవాలయంలో ఘనంగా జరిగాయి. పలు కాలనీలలో స్వామి వారి ఊరేగింపు, శ్రీరాముల వారికి హారతి కార్యక్రమం, భజనలు నిర్వహించారు. అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.


యాదాద్రి కాలనీలో ర్యాలీగా మహిళలు



శంషాబాద్: అయోధ్య బాల రాముడి ప్రాణ ప్రతిష్ట సందర్భంగా పట్టణంలో శ్రీ రామనామం మార్మోగింది. పట్టణంలోని సాతంరాయి కోదండ రామాలయంలో రాములోరి కల్యాణం వైభవంగా జరిగింది. సిద్ధాంతి హనుమాన్ దేవాలయం, నాగలింగేశ్వరాలయం, ధర్మసాయి మందిరం, వాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ప్రత్యేక పూజలు, కల్యాణోత్సవ కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అమ్మపల్లి శ్రీ రామచంద్ర ఆలయంలో జరిగిన పూజా వేడుకల్లో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, జెడ్పీటీసీ సభ్యురాలు నీరటి తనీర్రాజు పాల్గొన్నారు. అక్కడే ఏర్పాటు చేసిన ప్రత్యేక స్క్రీన్‌పై బాల రాముడి ప్రాణ ప్రతిష్టా కార్యక్రమాలను వీక్షించారు. కన్యకాపరమేశ్వరీ ఆలయంలో జరిగిన పూజా వేడుకల్లో ఆర్యవైశ్య సంఘం నాయకులు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చింతల నందకిశోర్ తదితరులు పాల్గొన్నారు.


అయోధ్యలో బాలరామ ప్రాణప్రతిష్ట కార్యక్రమంలో శ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి


అమ్మపల్లి సీతారామచంద్ర ఆలయంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, భక్తులు


గాయత్రీనగర్‌లో పూజల్లో పాల్గొన్న మేయర్ మహేందర్‌గౌడ్ తదితరులు


అలకాపూర్ టౌన్‌షిప్‌లో బైక్ ర్యాలీలో పాల్గొన్న భక్తులు


మణికొండ క్వార్టర్స్ పాల్గొన్న వీఫర్‌యు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు


రామాలయం ఆకారంలో ముగ్గు వేసిన మహిళ


శ్రీ రాముడి పూజల్లో పాల్గొన్న భక్తులు


శ్రీ రాముడి పూజల్లో భజనలు చేస్తున్న భక్తులు


అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

ప్రపంచ స్థాయి విద్యను అందించాలి

మణికొండ: ప్రపంచం ఆధునికంగా రూపుదిద్దుకుంటుందని, దాన్ని దృష్టిలో పెట్టుకుని అదే స్థాయిలో విద్యను అందించినపుడే విద్యార్థులు రాణిస్తారని కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ అన్నారు. హైదరాబాద్ నగర శివారు గౌలిదొడ్డిలోని అన్వయ కన్వెన్షన్‌లో సోమవారం ఐసీఎస్‌ఈ పాఠశాలల 66వ వార్షిక కాన్ఫరెన్స్ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు నిత్యవిద్యార్థులుగా నేర్చుకున్నపుడే నవీకరణ విద్యను విద్యార్థులకు అందించటం సాధ్యపడుతుందన్నారు. ప్రపంచం గ్లోబలైజేషన్ అవుతుందని, మన దేశంలో చదువుకున్న విద్యార్థులు రాబోయే రోజుల్లో వారి సామర్థ్యాన్ని బట్టి ఎక్కడైనా జీవించే స్థాయిలో వారిని తీర్చిదిద్దాలన్నారు. కేవలం సిలబస్ మాత్రమే కాకుండ విద్యార్థులకు అవసరమైన అన్ని రంగాలలోను వారిని రాణించేలా తీర్చి దిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్యాబోధనలో కొన్ని దేశాలు ఎంతో రాణిస్తున్నాయని, వాటిని పరిశీలించి అందుకు అనుగుణంగా మన దేశంలోను అలాంటి విద్యావ్యవస్థను తీసుకునిరావాల్సిన అవసరం పాఠశాలల యాజమాన్యాలకు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ మెట్రోపోలిటిన్ ఆర్చిబిషప్ కార్డినియల్ ఆంటోనీ, సీఐఎస్‌ఈసీ చైర్మన్ డాక్టర్ జి. ఇమాన్యూల్, ఏఎస్ఐఎస్‌సీ అధ్యక్షుడు ఎస్. వేతనాయగం, ఉపాధ్యక్షుడు జేమ్స్, కార్యదర్శి జోసఫ్, రీజినల్ సెక్రటరీ ఎ.సుందరిలతో పాటు కార్యవర్గ సభ్యులు, దేశ వ్యాప్తంగా ఉన్న ఐసీఎస్‌ఈ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలనతో కాన్ఫిరెన్స్‌ను ప్రారంభించిన డీకే శివకుమార్

నార్సింగిలో చైర్మన్ మార్పు కోసం మంతనాలు

- మెజార్టీ కౌన్సిలర్‌ల అంగీకారం
- ఎమ్మెల్యే అనుమతిస్తే ముందుకు

మణికొండ: మున్సిపాలిటీలలో మొదలైన అవిశ్వాస మంటలు ఒక మున్సిపాలిటీ నుంచి మరో మున్సిపాలిటీకి అంటుకుంటున్నాయి. గండిపేట మండల పరిధిలోని బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో 16 మంది కార్పొరేటర్‌లు మేయర్‌పై అవిశ్వాసం పెడుతూ కలెక్టర్‌కు లేఖను అందజేసిన విషయం తెలిసిందే. మణికొండ మున్సిపాలిటీలోను చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టాలని ఇప్పటికే 10 మంది కౌన్సిలర్‌లు సంతకాలు చేశారు. దాన్ని త్వరలోనే కలెక్టర్‌కు అందించే యోచనలో ఉన్నారు. నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఉన్న డి.రేఖ యాదగిరిని పదవి నుంచి తొలగించాలనే ప్రయత్నాలను మెజార్టీ కౌన్సిలర్‌లు మొదలు పెట్టినట్టు విశ్వసనీయ సమాచారం. వారంతా గోల్కొండ రిసార్ట్‌లో రెండు రోజుల క్రితం సమావేశమై ప్రస్తుత చైర్‌పర్సన్‌ను తొలగించి నార్సింగికి చెందిన కౌన్సిలర్ పత్తి ప్రవీణ్‌కుమార్‌ను చైర్మన్‌ను చేయాలనే నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. టీఆర్‌ఎస్ పార్టీ పుట్టినప్పటి నుంచి అదే పార్టీలో ఉద్యమ నాయకునిగా కొనసాగారు. అయినా గత ఎన్నికల సమయంలో ఆయనకు కౌన్సిలర్ టికెట్‌ను ఇవ్వకపోవటంతో ఇండిపెండెంట్‌గా పోటీ చేసి గెలుపొంది ఇటీవల ఎమ్మెల్యే ఎన్నికల సమయంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. మెజార్టీ కౌన్సిలర్‌లను ఆయన తన వైపు తిప్పుకోవటంతో వారంతా ప్రస్తుత చైర్‌పర్సన్‌ను తొలగించి అతన్ని చైర్మన్‌ను చేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్టు సమాచారం. ఒకటి, రెండు రోజుల్లో అదే విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ దృష్టికి తీసుకుని వెళ్లి ఆయనను ఒప్పించేందుకు ప్రయత్నిస్తామని ఓ ప్రజాప్రతినిధి 'సాక్షి'కి తెలిపారు.



పార్టీల బలా బలాలు...

నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో గత కౌన్సిలర్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తరపున 8మంది, బీఆర్‌ఎస్ తరపున 7మంది, స్వతంత్రులుగా ఇద్దరు, బీజేపీ నుంచి ఒకరుగా మొత్తం 18 మంది గెలుపొందారు. వట్టినాగులపల్లి స్వతంత్ర కౌన్సిలర్ బి.యాదమ్మ బీఆర్‌ఎస్‌కు మద్దతు ఇవ్వటం, బీజేపీ కౌన్సిలర్ ఆదిత్యరెడ్డి, చైర్‌పర్సన్ ఎన్నికలో పాల్గొనకపోవటం, ఎమ్మెల్యే, ఎంపీల ఎక్స్ అఫిషియో ఓట్లతో బీఆర్‌ఎస్‌కు చైర్మన్ పీఠం దక్కింది. కాంగ్రెస్‌లో గెలిచిన మంచిరేవుల కౌన్సిలర్ లంకల పద్మవీరారెడ్డి గత సంవత్సరం బీజేపీలో చేరటం, ఇటీవల ఎమ్మెల్యే ఎన్నికల సమయంలో 17వ వార్డు కౌన్సిలర్ ఉషారాణి, 8వ వార్డు స్వతంత్ర కౌన్సిలర్ పత్తి ప్రవీణ్‌కుమార్‌లు బీఆర్‌ఎస్‌లో చేరారు. దాంతో ప్రస్తుతం కాంగ్రెస్ బలం ఇద్దరు తగ్గి 6 మందికి పడిపోయింది. బీఆర్‌ఎస్ బలం 10 మందికి పెరిగింది. బీజేపీ బలం ఒకటి నుంచి రెండుకు చేరింది. చైర్‌పర్సన్‌ను మార్చాలంటే 11 మంది బలం అవసరమవుతుంది. స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మార్పుకు సమ్మతిస్తే ఆయన ఓటుతో అది సాధ్యం అవుతుంది. కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్‌లు చైర్మన్ మార్పుకు సమ్మతించినట్టు తెలిసింది. అపుడు అత్యధిక మెజార్టీతో చైర్మన్ మార్పు సునాయాసం కానుంది. బండ్లగూడ కార్పొరేటర్‌లు అవిశ్వాస తీర్మాణం పెట్టడంతో ఆగ్రహంగా ఉన్న ఎమ్మెల్యే నార్సింగిలో చైర్మన్ మార్పుకు అనుమతిస్తారా లేదా అనేది మరికొన్ని రోజుల్లో తేలనుంది.


శ్రీరాముడి పూజల్లో పాల్గొన్న భక్తులు

రామాంజనేయ ఆలయంలో పూజలు


పూజల్లో పాల్గొన్న భక్తులు

అత్తాపూర్: అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా కేశవ్‌నగర్ కాలనీలోని శ్రీ వీరభద్ర శివ రామాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున స్క్రీన్ ఏర్పాటు చేసి కాలనీవాసులు శ్రీరామ.. జయ రామ స్తోత్రం.. జై శ్రీ రాం నినాదాలు మధ్య వేద పండితులు విశ్వనాథ శర్మ మంత్రోచ్ఛరణలతో ఆలయ ప్రాంగణంలో భక్తులు కోలాహలంగా పండుగ వాతావరణం సంతరించుకుంది. పల్లకి సేవ ఊరేగింపులో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేశారు.

మైలార్‌దేవ్‌పల్లి: శ్రీ రామ ప్రతిష్ఠాపన సందర్భంగా గగన్ పహాడ్ విద్యుత్ కార్యాలయంలో విద్యుత్ అధికారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గగన్ పహాడ్ ఈఆర్‌ఏ అసిస్టెంట్ అకౌంట్ అధికారులు గోపినాగమణి, జూనియర్ అకౌంట్స్ అధికారులు రవీందర్, వెంకటకృష్ణ, సిబ్బంది పద్మనాభం, రవి ప్రసాద్, అకౌంట్ సిబ్బంది శ్రీనివాస్, మహిళ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


విద్యుత్ కార్యాలయంలో పూజలు నిర్వహిస్తున్న అధికారులు

దశాబ్దాల కల నెరవేరింది


శ్రీరాములోరి పూజలో పాల్గొన్న కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: రామజన్మ భూమిపై శ్రీరాముడి ఆలయం నిర్మించి దశాబ్దాల కల నేరవేర్చిన భారత ప్రధానిపై యావత్ ప్రపంచం గరిర్వస్తున్నదని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం పలు దేవాలయాలలో ఆయన సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ..హిందువుల ఆరాధ్యదైవం శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠను దేశ ప్రజలు తమ ఇళ్లల్లో కూర్చొని తిలకించేలా చేసిన భారత ప్రధానికి కృతజ్ఞతలు తెలిపారు. రాముడి ప్రతిష్ఠాపనను పురస్కరించుకొని ప్రతి ఇంట్లో పూజలు చేస్తూ ప్రజలు ప్రత్యేక పండుగను జరుపుకుంటున్నారని అన్నారు.


పూజల్లో పాల్గొన్న మణికొండ మున్సిపల్ కమిషనర్, మేనేజర్, కౌన్సిలర్‌లు, సిబ్బంది

మణికొండ: రామ నామ జపంతో గండిపేట మండల పరిధిలోని మణికొండ, పుప్పాలగూడ, నెక్నాంపూర్, నార్సింగి, మంచిరేవుల, గండిపేట, కోకాపేట, ఖానాపూర్, వట్టినాగులపల్లి, గౌలిదొడ్డి గ్రామాలు మారుమ్రోగాయి. సోమవారం అయ్యోధ్యలో బాలరాముడి ప్రతిష్ఠాపన జరగటంతో మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలోని ప్రతి గ్రామంలో ఉన్న హనుమాన్, శ్రీరామాలయాలలో ప్రత్యేక పూజలు, అన్నదానాలు, బైక్‌ర్యాలీలు, పల్లకీ సేవలు, ప్రసాద వితరణలు పెద్ద ఎత్తున చేపట్టారు. మండల పరిధిలో ఎటు చూసినా రామ నామమే వినిపించింది. దేవాలయాల సముదాయాలలో అయోధ్యలో జరిగే ప్రతిష్ఠాపన కార్యక్రమాలను ఎల్‌ఈడీలలో ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఆయా కార్యక్రమాలలో ఎమ్మెల్యే, మున్సిపాలిటీల చైర్మన్‌లు, వైస్ చైర్మన్‌లు, కౌన్సిలర్‌లు, కమిషనర్, సిబ్బంది, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అయోధ్య కరసేవకుడికి సన్మానం

బండ్లగూడ: శ్రీ రామ జన్మభూమి కరసేవలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానని గోకరి అర్జున్‌గౌడ్ అన్నారు. 1992 సంవత్సరంలో అయోధ్య కర సేవలో పాల్గొన్న శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయం, శ్రీ శారదాధామం అధ్యక్షులు గోకరి అర్జున్‌గౌడ్‌ను సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గోకరి అర్జున్‌గౌడ్ ఆనాటి గుర్తులను నెమరవేసుకున్నారు. అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి కర సేవలో పాల్గొని అనేక ఉద్యమాలు, పోరాటాలు చేశామన్నారు. ఇన్ని ఏళ్ల తరువాత అయోధ్యలో శ్రీరాముల వారి దేవాలయాన్ని నిర్మించి బాలరాముడి ప్రాణ ప్రతిష్ట చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాభారతి అఖిల భారత కార్యకారిని కాశీపతి, విద్యాభారతి దక్షిణ మధ్యక్షేత్ర కోశాధికారి పసర్థి మల్లయ్య, విద్యాభారతి దక్షిణ మధ్యక్షేత్ర ప్రశిక్షణ ప్రముఖ్ రావుల సూర్యనారాయణ, ప్రబంధకారిని సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలను శుభ్రం చేసిన రామభక్తులు


మార్కండేయనగర్ వీరాంజనేయ ఆలయాన్ని శుభ్రం చేస్తున్న దృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి: అయోధ్య శ్రీరామ జన్మభూమిలో శ్రీరాముని ప్రాణ ప్రతిష్ఠా మహోత్సవం నందర్భంగా మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలలో ఉన్న దేవాలయాలను ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం శుభ్రం చేశారు. మార్కండేయనగర్, బాబుల్‌రెడ్డి నగర్, మధుబన్ కాలనీ, టీఎన్జీవోస్ కాలనీ, గణేష్ నగర్, కాటేదాన్ ప్రాంతాలలో దేవాలయ కమిటీ సభ్యులు ఆలయాలను నీటితో కడిగి శుభ్రం చేశారు. అయోధ్య రాముడికి అక్కడ ప్రాణ ప్రతిష్ఠ నిర్వహన కార్యక్రమం జరుగుతుండగా ఇక్కడ అన్ని ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సాయంత్రం కాలనీ వాసులందరు తమ ఇళ్లల్లో దీపాలు వెలిగించాలని ఆలయ కమిటీ సభ్యులు ప్రజలను కోరారు.

ట్రిపుల్‌ఐటీలో 'ఈయూ' బృందం



రాయదుర్గం: ట్రిపుల్ ఐటీ హైదరాబాద్‌ను 'ఈయూ '(యూరోపియన్ యూనియన్) రాయబారి హెర్వే డెల్ఫిన్ బృందం సందర్శించింది. స్మార్ట్‌సిటీ లివింగ్ ల్యాబ్‌ను పరిశీలించారు. నీరు, శక్తి, సోలార్, కాలుష్యం, వాతావరణం, ఆక్యుపెన్సీ/క్రౌడ్ మేనేజ్‌మెంట్ వంటి అంశాలపై ఈ ల్యాబ్ పనితీరుపై ఈ యూ బృందం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా 5జీ, 4జీ, వైఫై, లోరవాన్, వైసన్ వంటి అంశాలపై ఈ ల్యాబ్ దృష్టి పెడుతుందని ట్రిపుల్‌ఐటీ ప్రతినిధులు ఈ బృందానికి వివరించించింది. వ్యర్థాల నిర్వహణపై పలు అంశాలను కూడా అడిగి ఈయూ బృందం తెలుసుకుంది.